శ్రీ పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ పైన ఉండాలని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అభిల షించారు. మంగళవారం నాడు మూడు లాంతర్లు జంక్షన్ వద్ద ఉన్న చదురు గుడిలో పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల రాక సందర్భంగా ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు సాదర స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అంద జేశారు. అనంతరం ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ఉత్త రాంధ్ర కల్పవల్లిగా పేరుగాంచిన పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతరకు మన రాష్ట్ర నుంచే కాకుండా, వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు సిరిమానోత్సవ సంబరాన్ని తిలకించి, అమ్మవారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా, సంప్రదాయ బద్ధంగా వస్తోందని అన్నారు. అమ్మవారి ఆలయాన్ని విస్తృత పరిచి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని లక్ష్యంతో, మంత్రి బొత్స సత్య నారాయణ గారి సహాయ సహకారాలతో కృషి చేస్తున్నామని అన్నారు. భక్తుల సౌక ర్యార్థం దృష్ట్యా, ఆలయం చుట్టుపక్కల ఉన్న వ్యాపారస్తులతో ప్రభుత్వ అధికారులు మాట్లాడడం, దానికి వారు భక్తితో స్వచ్ఛం దంగా ముందుకు రావడం జరిగిందన్నారు. ఆలయం ఎ దురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వ్యాపారులకు ఇవ్వడం జరిగిందన్నారు. త్వరితగతిన ఆలయాన్ని అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌక ర్యాలు కల్పించి, నిత్య అన్నదానాన్ని ఈ ప్రాంతంలోనే కొనసాగించే విధంగా చర్యలు చేపడు తున్నామన్నారు. దేవస్థానం పాలకమండలి 12 మంది సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారని, గత పాలకవర్గం కంటే మెరుగైన సేవలు అందిస్తున్నారని అన్నారు. ప్రతినిత్యం అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని, ఇందుకు తగ్గట్టుగా ఆలయాన్ని మరింత సుందరీకరించ నున్నామని అన్నారు. డిప్యూటీ స్పీకర్ వెంట దేవాలయ పాలకమండలి సభ్యులు ఎంకె బి, పతివాడ వెంకటరావు, వెత్స శ్రీనివాసరావు, శ్రీమతి గంధం లావణ్య, శ్రీమతి చి ల్లా పుష్ప, శ్రీమతి రామ్ సింగ్ సూరమ్మ, పార్టీ నాయకులు వేత్సా సాయి, చిల్ల వాసు, గంధం హరిబాబు, గొల్లపూడి మాధవరావు, వంకాయలపాటి శ్రీనివాసరావు, ముద్దాడ రాజు తదితరులున్నారు.

రాజాంలో రూ.16.67 కోట్లతో రోడ్డు విస్తరణ

పనులకు 18న శంకుస్థాపన చేయనున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర - విజయనగరం : రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రాజాం మునిసిపాలిటీలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ, పటిష్టవంతం చేసే పనులకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ బుధవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్టు రోడ్లు భవనాల శాఖ ఇ.ఇ. బి.వి.రమణ తెలిపారు. విజయనగరం - పాలకొండ రోడ్డులో 47వ కిలోమీటరు నుంచి 51వ కి.మీ.వరకు పట్టణ పరిధిలో విస్తరణ జరుగుతుందన్నారు. నాలుగు కిలోమీటర్ల పరిధిలో రోడ్డును రూ.16.67 కోట్లతో 80 అడుగులకు విస్తరించనున్నట్టు తెలిపారు. నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించనున్న ఈ రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా డ్రెయిన్లను కూడా నిర్మిస్తామని, సెంట్రల్ డివైడర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విజయ నగరం జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్, స్థానిక శాసనసభ్యులు కంబాల జోగులు, ఎం.ఎల్.సి. పాలవలస విక్రాంత్, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ కూడలిలో విస్తరణ పనుల శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి 15 నెలల్లోగా ఈ పనులు పూర్తిచేసేందుకు విజయనగరంకు చెందిన నిర్మాణ సంస్థ పృథ్వి కన్‌స్ట్రక్షన్స్ తో రోడ్లు భవనాల శాఖకు ఒప్పందం జరిగిందన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి ముఖహాజరు ప్రారంభం

కొత్తవిధానంలో ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు



విశాలాంధ్ర - జామి : జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలలోని ఎంపిడివో కార్యాల యాలలో మంగళ వారం నుంచి సిబ్బందికి ముఖ హాజరు ప్రారంభ మయింది. ఇప్పటి వరకు వేలి ముద్రల ద్వారా హాజరును నిర్వహించిన సిబ్బంది ఇకపై తాము పనిచేసే కార్యాలయ ప్రాంగణం నుంచి ముఖ హాజరును నమోదు చేసుకోవాల్సి ఉంది. సిబ్బందికి తప్పకుండా ఆండ్రాయిడ్ మొబైల్ ఉండాలి. అలాగే ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతనంగా ఏపిఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంది. పది రోజుల క్రితమే ఈయాప్ వినియోగంపై అన్ని కార్యాలయాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఉదయం 10.30 గంటలకు, తిరిగి సాయంత్రం 5 గంటలకు యాప్‌ను వినియోగించాల్సి ఉంది. గతంలో బయోమెట్రిక్ అమలు చేసే సమయంలో దాదాపు 5 మండలాల అధికారులు, సిబ్బంది హాజరును భేఖాతర్ చేసారు. వారికి జిల్లా పరిషత్ నుంచి మెమోలు సైతం అందాయి. తాజాగా ముఖ హాజరు విదానం పట్ల సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈముఖ హాజరు విదానం ఉపాధ్యాయులకు అమలు చేస్తున్నారు. వారు పడుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. తాజాగా మండల పరిషత్ ఉద్యోగులు మంగళవారం నుంచి అమలులోకి తెచ్చారు.

ఇబ్బంది పడుతున్న నాల్గవ తరగతి ఉద్యోగులు..

ప్రభుత్వం తాజాగా పెట్టిన ముఖ హాజరు కారణంగా నాల్గవ తరగతి ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటి వరకు చాలామంది సాదారణ మొబైల్‌ను వాడుతున్నారు. కానీ ఇకపై ఆండ్రాయిడ్ మొబైల్ తప్పనిసరిగా వాడాల్సి ఉంది. దీంతో కొత్త ఫోన్లు కొనాల్సిన పరిస్థితి చాలామందికి ఎదురవుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న విదానంపట్ల మండల పరిషత్ సిబ్బందిలో బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వల్లంపూడిలో వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని వల్లంపూడి గ్రామంలో 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగి ందని వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె. రాజు తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన వెల్నెస్ కేంద్రంలో 52మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 35 మందికి ల్యాబ్ పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గ్రామస్తుల తో మాట్లాడుతూ ప్రస్తుతం కోవిడ్ పరిణామాలు అధికమవుతున్నాయని రానున్నది జాతరల తీర్థాలు సందర్భంగా ప్రతి ఒక్కరు సామాజిక దూరం పాటించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య పరీక్షల్లో ఆయనతోపాటు వైద్యాధికారిని రజిని వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి బి.కోమలి, ఏఎన్ఎం పి. వెంకట లక్ష్మి, ఎంపిహెచ్ ఏడి. సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల పోలీసు స్టేషను ఎస్పీ ఆకస్మిక సందర్శన

విశాలాంధ్ర - నెల్లిమర్ల : జిల్లా ఎస్పీ ఎం.దీపిక నెల్లిమర్ల పోలీసుస్టేషన్ ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సంద ర్భంగా పోలీసు స్టేషను ప్రాంగ ణం, స్టోర్ రూంను పరిశీలించి, స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్ ను తనిఖీ చేశారు. పెండింగులో ఉన్న కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చెయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భోగాపురం సిఐ విజయనాథ్, నెల్లిమర్ల ఎస్ఐ శ్రీ నారాయణరావు ఉన్నారు.

నాటు సారా నివారణకు కృషి చేయాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : నాటు సారా తయారీ, అమ్మకాలకు ప్రజల స్వస్తి చెప్పాలని మత్తు పదా ర్థాలు వాడకానికి దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్ఫో ర్స్మెంట్ బ్యూరో, ఇన్స్పెక్టర్ ఆర్.జైభీమ్ ఆధ్వ ర్యంలో మంగళవారం బొబ్బిలి మండలం దిబ్బ గుడ్డివలస రోడ్ పై పలు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. సంక్రాతి పండగ సందర్భంగా గత మూడు రోజులగా పట్టణ, మండల పరిధిలో పలు సెంటర్లో నాటుసారా రవాణా, అక్రమంగా మద్యం రవాణా మరియు గంజాయి ఇతర డ్రగ్స్ లాంటి నిషేధిత పదార్థాలు రవాణా అవకుండా నిరోదించేందుకు ప్రతీ వాహనాల్ని తనిఖీ చేయడం జరుగుతుందని దీనికి వాహన దారులందరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో డిపార్ట్మెంట్ వారికి తనిఖీ లో సహకరించాలని సీఐ జైభీమ్ కోరారు.

23న సర్కిల్ స్థాయి డాక్ అదాలత్

విశాలాంధ్ర - విజయనగరం : ఈ నెల 23న విజయవాడ వేదికగా సర్కిల్ స్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విజయనగరం తపాలా శాఖ సూపరింటెండెంట్ ఈశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ లోని తపాలా కార్యాలయాలలో అందించే సేవలకు సంబంధించిన అంశాలపై జనవరి 23వ తేదీ 11.30 గంటలకు విజయవాడ పోస్టల్ సర్కిల్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులను ఈ నెల 18వ తేదీ లోగా మెయిల్ లేదా పోస్టల్ ద్వారా కె. సుధీర్ బాబు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్ (ఫిర్యాదులు - సంక్షేమం), చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ - 520 013 చిరునామాకు పంపించాలని సూచించారు.

పట్టాలు తప్పిన కిరండోల్ పాసింజర్

ప్రయాణికులు సురక్షితం, వేరే బోగీల్లో ప్రయాణికులను తరలించిన అధికారులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం, శివలింగ పురం రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ట్రాక్ పై విశాఖపట్నం-కిరండోల్ ప్యాసింజర్ మంగళవారం ఉదయం పట్టాలు తప్పింది. ప్యాసింజర్ రైలు స్టేషన్ ఛైరువులో ఉన్న సమయంలో 6వ భోగి పట్టాలపై అదుపుతప్పింది. దీంతో విషయం తెలుసుకున్న ప్యాసింజర్ గార్డ్ ఎమర్జెన్సీ బటన్ ద్వారా ప్యాసింజర్‌ను నిలిపివేశారు. పట్టాలు తప్పిన రైలులో ప్రయాణిస్తున్నటు వంటి ప్రయాణికుల్ని సురక్షితంగా వేరే భోగిల్లో చేర్చి కొన్ని భోగిలతో కిరండల్ పాసింజర్ ని ఉన్నతాధికారులు పంపించారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి కూడా ఎటువంటి ప్రమాదం జరగలేదని అక్కడ ఉన్నటువంటి అధికారులు, రైల్వే సిబ్బంది తెలియజేశారు.

ఉచితంగా దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర - చీపురుపల్లి : మండలం చిన్ననడిపల్లి గ్రామంలో సర్పంచ్ గడే సత్యవతి, మోహన రావు సొంత డబ్బులతో ప్రజలకు వాటర్ డ్రమ్ములు, బట్టలు ఉచితంగా పంపిణీ చేస్తున్న కార్యక్రమం లో పాల్గొని ప్రజలకు వాటర్ డ్రమ్ములు, బట్టలు పంపిణీ చేసిన వైస్సార్ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, మండల వైస్సార్ పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, చైర్మన్ ధన్నాన జనార్ధన, సర్పంచ్ కరిమజ్జి శ్రీనివాసరావు ఈ సందర్బంగా మాట్లాడుతూ పెద్దలు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గారు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుగారు,ఎంపీ బెల్లానచంద్రశేఖర్ గారి కృషి తో చిన్ననడిపల్లి గ్రామంలో ఇంటి ఇంటి కుళాయి లు వేసుకున్నాం అని కొళాయి ద్వారా వచ్చే మంచి నీరు వేస్ట్ అవకుండా నీళ్ల నిల్వ చేసుకోవడానికి సర్పంచ్ గడే సత్యవతి, సొంత డబ్బులతో ప్రజలకు ఉచితంగా అందించడం చాలా ఆనందించదగ్గ విషయం అని అన్నారు అలాగే పేద ప్రజలకు బట్టలు పంపిణీ చేయడం హర్షించవలసిన విషయం అన్నారు, గ్రామంలో అందరూ ఐకమత్యం తో అభివృద్ధి చేసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమం లో వైస్సార్ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ధన్నానజనార్ధన్, కరిమజ్జి శ్రీను, గడే సత్యవతి, మోహనరావు, కృష్ణ, మురళి, కిషోర్ పాల్గొన్నారు

కల్వర్టును తక్షణమే నిర్మించాలి

విశాలాంధ్ర - రామభద్రపురం : మండల పరిధిలోని తారాపురం గ్రామంలో శివ ఆలయం కెళ్ళే దారిలో తక్షణమే కల్వర్టు నిర్మించాలని దుంప వీధికి చెందిన తర దాల శంకర్రావు, వెక్కుదు జగదీలు కోరుచున్నారు. మధ్య వీధిలో ఉన్న కల్వర్టు కొన్ని సంవత్సరాలుగా కుంగి పోవడంతో కాలువలో ప్రవహించే నీరంతా ఇంట్లోకి చేరిపోతుందని అంటున్నారు. కల్వర్టు ఖానా విరిగిపోవడం వలన మట్టంతా కానా మధ్యలో ఉండిపోవడంతో కాలువలో ప్రవహించే మురికి నీరు రోడ్డు మీదకు రావడం వలన చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు ఎక్కువగా చేరి మనుషులు కుడుతున్నాయని వాటి ద్వారా ప్రాణాంతకమైన డెంగి, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ వంటి జ్వరాలు ప్రభలే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు కల్వర్టు నిర్మించాలని చెప్పుకున్న వారు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సెక్రటరీ కిఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పంచాయతీలో డబ్బులు నిలవలేవని సమాధానం చెబుతున్నారే తప్ప కలవర్టును బాగు చేయడం లేదని అంటున్నారు. తక్షణమే ఉన్న స్థాయి అధికారులు స్పందించి కల్వర్టు బాగు చేయాలని దుంప వీది ప్రజలు కోరుచున్నారు.

ఘనంగా శ్రీ శ్రీ కనకదుర్గ జాతర మహోత్సవం

విశాలాంధ్ర - గంట్యాడ : మండలంలోని కొటారు బిల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీశ్రీ కనకదుర్గమ్మ తల్లి జాతర మహోత్సవం బుధవారం అత్యంత భక్తి శబ్దం నడుమ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏదాది కనుమ మరుసటి రోజు వచ్చే ఈ జాతరకు వేలాదిగా ఇతర రాష్ట్రాల సైతం భక్తులు వచ్చి దర్శించుకుంటారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బాధలు తీరారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా ఆలయ నిర్వాహకులు బర్కెట్స్ ఏర్పాటు. చేశారు. ట్రాఫిక్ జాబ్ అవకుండా గంజాడ ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు. గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్యతో పాటు ఏఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడుపలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదర్శమూర్తి జ్యోతిబసు : రెడ్డి వేణు

విశాలాంధ్ర - సీతానగరం : రాజకీయాల్లో ఆదర్శమూర్తిగా, పరిపాలనదక్షుడిగా, వామ పక్షాలకు మార్గదర్శిగా జ్యోతిబాసు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. మంగళవారం జ్యోతిబసు 13వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత కమ్యూనిస్టు ఉద్యమ తొలితరంనేత, సిపిఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యులుగా నిలిచి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా సేవలు అందించి చరిత్ర సృష్టించిన మహాఆదర్శ మూర్తిగా కామ్రేడ్ జ్యోతిబసు నిలిచారని అన్నారు. అధికారం అలంకరణ కాదని, ఆడంబరం కాకూడదని, ఆపన్నులకు తోడుగా నిలవాలని, అవసరం ఉన్నవారికి అండకావాలని ఆశించి..ఆచరించి..నేటి కమ్యూనిస్ట్ ఉద్యమానికి ఆదర్శంగా నిలిచిన అసలైన నాయకుడు జ్యోతిబాసేఅని, దున్నే వాడికి భూమిహక్కు ఉండాలని, ఆశించినటువంటి నాయకుల స్పూర్తితో భవిష్యత్ ఉద్యమాలను ఉధృతం చేయాలని కార్మికులు, రైతులు, యువకులతోనే సాధ్యమనిఅన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మీ నాయుడు, రైతు నాయకుల బి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్ ఈశ్వర రావు, సిఐటియు నాయకులు జి,వెంకట రమణ, కౌలు రైతు సంఘం నాయకులు రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై మంగళవారం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలను నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మైదానంలో ఏర్పాట్లను రహదారులు భవనాల శాఖ చేయాలని, వేదిక పర్యవేక్షణ రెవిన్యూ డివిజనల్ అధికారి చూడాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర పండుగగా నిర్వహించడం జరుగుతున్నందున పూర్తి స్థాయిలో పోలీస్ పెరేడ్, బందోబస్తు ఉండాలని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. మైదానంలో పారిశు ధ్యం నిర్వహణ, తాగునీటి ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించాలని చెప్పారు. గణతంత్ర వేడుకలకు విద్యుత్తు సరఫరా ఇబ్బందులు కాకుండా ఈ పిడిసి ఎల్ అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మైదానం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ ను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. పౌర సరఫరాల సంస్థ, పౌర సరఫరాల శాఖ, గృహ నిర్మాణ సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖ, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ శాఖలు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జలవనరుల శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ తదితర శాఖలు శఖటాలను ఏర్పాటు చేయాలని, రవాణా శాఖ, ఐసీడీఎస్, అటవీశాఖ తదితర శాఖలు ప్రదర్శనశాలలను ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రదర్శనశాల ఏర్పాటుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, శఖటాల ఏర్పాటుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సమన్వయకర్తలుగా ఉంటారని ఆయన చెప్పారు.

రాష్ట్రానికి ఏడు క్లస్టర్ల మంజూరు

చేనేత మరియు జౌళి అధికారి ధర్మారావు

విశాలాంధ్ర - పార్వతీపురం : జాతీయ చేనేత అభివృద్ధి పథకంలో భాగంగా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద రాష్ట్రానికి మంజూరైన ఏడు క్లస్టర్లలలో రెండు జిల్లాకు మంజూరైనట్లు జిల్లా చేనేత మరియు జౌళి అధికారి, ఐ.ధర్మారావు తెలిపారు. పాలకొండ, నారాయణపురం లలో ఈ క్లస్టర్లు ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. జాతీయ చేనేత అభివృద్ధి పథకం క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమునకు మంజూరైన క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లో టెక్స్టైల్ డిజైనర్" (07 ఖాళీలు) మరియు " క్లస్టర్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్" (07 ఖాళీలు) గా పని చేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు సంచాలకులు, చేనేత మరియు జౌళి శాఖ, ఆంధ్రప్రదేశ్, అమరావతి వారికి ధరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలియజేసారు.

లోకేషన్ కలిసిన మాజీ ఎమ్మెల్సీ జగదీష్

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి నారా లోకేష్ ను మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ మంగళవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చములో అందజేశారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. అదే విధంగా పార్వతీపురం నియోజకవర్గంలో పాటు ఉమ్మడి విజయనగరం జిల్లా తాజా రాజకీయాలపై లోకేష్ ఆరా తీశారు. త్వరలో లోకేష్ చేపట్టిన పాదయాత్ర పై చర్చించారు.

ఎంఆర్సీను సందర్శించిన ఎస్ఎస్ఏ టీము



విశాలాంధ్ర - సీతానగరం : జిల్లాలో పలు మండలాల్లోని ఎం ఆర్ సిలను సర్వ శిక్షా అభియాన్ పథకం టీము సందర్శన చేస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ చౌక్కాపు శ్రీనివాస రావు తెలిపారు. మంగళ వారం స్తానిక ఎంఆర్సి పరిశీలనకు వచ్చిన ఆయన మాట్లాడుతూ మండలాల్లో సిఆర్ యాప్, నాడు నేడు పనులు అమలు, సమ్మెటివ్ పరీక్షలు-1 జవాబు పత్రాలు దిద్దుబాటు తదితర అంశాలను పరిశీలించి తగు సూచనలు తెలియజేస్తున్నామని తెలిపారు. జిల్లా విద్యా శాఖాధికారి అదేశాలు మేరకు ఎం ఆర్ సి లను సందర్శన చేస్తున్నామని తెలిపారు. ఆయనతో పాటు ఏపిఓ వైకెబి ప్రసాద్, మండల విద్యాశాఖాధికారి సూరి దేముడు, ఎంఆర్ సిసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కామ్రేడ్ జ్యోతిబసు వర్ధంతి



విశాలాంధ్ర - బెలగాం : కామ్రేడ్ జ్యోతిబసు 13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో అయన చిత్రపటానికి సిపిఎం పార్వతీపురం సీనియర్ నాయకులు ఎం. నర్సింహామూర్తి, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత కమ్యూనిస్టు ఉద్యమ తొలితరం నేత, సిపిఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యులుగా నిలిచి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా అనేక సేవలు అందించి చరిత్ర సృష్టించిన మహా ఆదర్శమూర్తిగా కామ్రేడ్ జ్యోతిబసు నిలిచారన్నారు. అధికారం అలంకరణ కాదని, ఆడంబరం కాకూడదని, ఆపన్నులకు తోడుగా నిలవాలని, అవసరం ఉన్నవారికి అండకావాలని ఆశించి, ఆచరించి నేటి కమ్యూనిస్ట్ ఉద్యమానికి ఆదర్శంగా నిలిచిన అసలైన నాయకుడు జ్యోతిబసు అని, అటువంటి నాయకుల స్పూర్తితో భవిష్యత్ ఉద్యమాలను ఉధృతం చేయాలని కార్మికులు, రైతులు, యువకులతోనే సాధ్యమ న్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చినబోగిలిలో ఘనంగా ముగిసిన సంక్రాంతి పండుగ సంబరాలు

విజేతలకుబహుమతులు, పేదలకు చీరలు, దుప్పట్లు అందజేత

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని చినభోగిలి గ్రామంలో ఉద్యోగస్తులు, యూత్, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దల అధ్వర్యంలో జరిగిన సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగ ముగిశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు, డాన్స్ పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు పెద్దఎత్తున బహుమతులు అంద జేశారు. కీర్తిశేషులుచుక్క భగవాన్ నాయుడు, మర్రాపు పైడిపు నాయుడు, కురమానరాయప్ప, సబ్బాన రామినాయుడు, మమ్ముల నర్సింగరావు, వి.చంద్రమ్మ, చుక్క సంగమయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు అధ్వర్యంలో కార్యక్రమాలని నిర్వహించారు. గ్రామంలో జాతీయ స్తాయిలో జెఈఈలో మంచి మార్కులు సాధించిన చుక్క నితిన్, హ్యాండ్ బాల్ పోటీలో జాతీయ స్తాయిలో ప్రతిభ కనబరిచిన సబ్బాన నిత్యేశ్వరి, కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐబిలో ఉద్యోగం సాధించిన గునుపూరు మధుహర్ష, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి వారికి మేమెంటోలను అందజేసారు. దీంతో పాటు పదోతరగతిలో గ్రామంలో అత్యధిక మార్కులు సాధించిన వారిని, సీతానగరం ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివి చినభోగిలి గ్రామం నుంచి అత్యధిక మార్కులు సాధించిన వారికి కూడా పారితోషికాలు, మేమెంటోలు అందజేసి సత్కారం చేశారు. దీంతో పాటు ఆయా కుటుంబ సభ్యులు గ్రామంలోని నిరుపేదలందరికీ చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో చుక్క శ్రీనివాసరావు, మాధవరావు, ఎస్ సాంబశివరావు, మమ్ముల విశ్వేశ్వరరావు, మర్రాపు వేణు, సబ్బాన మురళి, కురమాన రాయప్ప కుటుంబసభ్యులు, గ్రామసర్పంచ్ కురమాన రాధశ్రీనివాసరావు, ఎంపీటీసీ గుర్రాల బుజ్జి, మాజీ సర్పంచ్ రాంబాబు, మాజీ ఎంపిటిసి చుక్క వెంకట నాయుడు, ఉపసర్పంచ్ గంట రమేష్, బి అప్పారావు, చుక్క గణేష్ తదితర గ్రామపెద్దలు, వివిధ ప్రాంతాలలో పని చేసే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గత పదేళ్ళుగా సంక్రాంతి పండుగ మూడు రోజులు పాటు గ్రామంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తూ సంక్రాంతి పండుగ వైభవాన్ని చాటిచెబుతున్నట్లు చుక్క శ్రీనివాస రావు, సబ్బాన మురళి, మర్రాపు వేణులు తెలిపారు. సంస్కృతి గూర్చి కూడా ముగింపు రోజున యువతకి తెలియజేస్తు న్నామని తెలిపారు.

దళితులను నిలువునా ముంచిన జగన్ సర్కార్

టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొండ్రు మురళీమోహన్



విశాలాంధ్ర - పాలకొండ : రాష్ట్రంలో దళితులకు జగన్ సర్కార్ నిలువు ముంచేసిందని దళిత ద్రోహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి కొండ్రు మురళీమోహన్ మండిపడ్డారు. ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీల మీదే అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత జగన్‌దేనన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వైసిపి సర్కార్ మళ్లిస్తోందని, ఎస్సీ కార్పొరేషన్ ను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. టీడీపీ హయాంలోనే రెసిడెన్షియల్ స్కూల్ ను ఎన్టీఆర్ ప్రారంభించారని, ఎస్సీ, ఎస్టీలకు జగన్ ఎంత అన్యాయం చేశారో..అంకెలతో సహా చెబుతామన్నారు. జీవో నెం. 77 తెచ్చి.. ఎస్సీ, ఎస్టీ పిల్లలకు స్కాలర్ షిప్, ఫీజ్ రియంబర్స్ మెంట్ లేకుండా జగన్ సర్కార్ తెచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీల డిపట్టాలను లాక్కున్నారని, ఎస్సీ, ఎస్టీలను జగన్ ప్రభుత్వం మోసం చేస్తుంటే ఎస్సీ, ఎస్టీల మంత్రులు, వైసిపి నేతలు మాట్లాడడం లేదన్నారు. 28 పథకాలను వైసీపీ తొలగించిందని, టిడిపి అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయడం లేదని, జగన్ ఒక సైకో...ఆయనకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రజలకు ఉందన్నారు.

19వ తేదీలోగా ఉద్యోగుల జాబితా

విశాలాంధ్ర - బెలగాం : ఉత్తమ ఉద్యోగుల జాబితాను ఈ నెల 19వ తేదీలోగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందజేయడం జరుగుతుందని, ఇందుకుగాను ప్రతి శాఖ నుండి ఇద్దరు ఉద్యోగుల కంటే ఎక్కువ ఉద్యోగులను వివరాలను సమర్పించరాదని ఆయన స్పష్టం చేశారు.

ఇరువరి ఘర్షణలో పలువురికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో గాయాలైన ఘటన చోటుచేసుకుంది. పార్వతీపురంజిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలి లావున్నాయి. పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామానికి చెందిన నీలాపు సూర్యనారాయణ మేనల్లుడు 11 ఏళ్ళ వయసు వున్న జి.శశికుమార్ కు అదే గ్రామానికి చెందిన వర్రి దుర్గాప్రసాద్ మద్యం పట్టించడంతో వాంతులు చేసుకొని మత్తుతో పడిపోయాడు. విషయాన్ని తెలుసుకున్న సూర్యనారాయణ దుర్గాప్రసాద్ ఇంటికి వెళ్ళి మామేనల్లుడు శశికుమార్ కు మద్యం ఇచ్చి ఎందుకు చెడగొడుతున్నావని అడగటానికి వెళ్ళాడు. తరువాత దుర్గాప్రసాద్, అతని భార్య వర్రి సీత కలసి సూర్యనారాయణ ఇంటికి వచ్చి మమ్మల్ని ప్రశ్నిస్తావా అంటూ తగువులాడి రాళ్ళతో దాడి చేశారు. ఈదాడిలో సూర్య నారాయణ తలకు, చేతికి బలమైన గాయాల య్యాయి. వెంటనే వారు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రాగా వైద్యులు చికిత్సను అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆరోగ్యదాయక సంవత్సరంగా 2023

విశాలాంధ్ర - పాలకొండ : 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి గుర్తించడం ఆరోగ్యదాయక సంవత్సరంగా భావించవచ్చని అభ్యుదయ రైతు కండవు ప్రసాదరావు తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారతదేశం అధిక మొత్తంలో చిరుధాన్యాలు పండించే దేశం అయినప్పటికీ మారుతున్న కాలంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్లో ఎక్కువ బియ్యం గోధుమనే వాడుతున్నారు దీనికి కారణం చిరుధాన్యాలు తక్కువ విస్తీర్ణంలో పండించడం దిగుబడి తగ్గుదల ముఖ్యంగా చిరుధాన్యాలు తినేందుకు మరియు వాడేందుకు అనువుగా తయారు చేయడం శ్రమతో కూడిన పని. ఇవి నేరుగా తినేందుకు మార్కెట్లో దొరకపోవడం ప్రస్తుతం ఆధునిక కాలంలో ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన పెరుగుతుండటం వల్ల చిరుధాన్యాలు మార్కెట్లో డిమాండ్ పెరుగుతుంది.అందుకే ప్రధాన కారణం పేదలందరికీ పోషకాహారాలు అందాలంటే పప్పులు వినియోగం తగ్గడం. మొదట హరిత విప్లవం ముందు పప్పులు ఆర్థిక తలసరి వినియోగం 1995 లో 25.7 కిలోలు నేడు16.3 కిలోలు అవుతుంది. వార్షిక తలసరి బియ్యం లభ్యత 1951 లో 58 కిలోలు పప్పులు 22.1 ఉంటే 2021లో బియ్యం 71.9కి, పప్పులు 16.4 కి తగ్గాయి. దిగుబడులు పెరగడానికి రసానికి ఎరువులు పురుగు మందులు వాడటం వల్లవాటి అవశేషాలు తినే ఆహార పదార్థాలు ఉండటం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం వంటి వ్యాధులకు గురవుతున్నారు. ప్రస్తుత హరిత విప్లవంలో ఎంత పంట పండించామని కంటే ఎంత ఆరోగ్యమైన పంట పండించామనేది ముఖ్యం. అందుకే ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల వైపు దృష్టి మళ్లించారు. చిరుధాన్యాలు ప్రాముఖ్యతను గుర్తించి 2023 సంవత్సరమును అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ చిరుధాన్యాల పంటల్లో వర్షాధారంగా మరియు నీటి వస్తువులు ఉన్న ప్రాంతంలో ప్రాంతాలకు అనువైన వంగడాలను అభివృద్ధి పరిచే దేశంలో పరిశోధనలు ముమ్మరంగా జరుపుతుంది. ప్రధాన పంటలను కోల్పోకుండా రైతులు చిరుధాన్యాలను పండించుకునే అవకాశం పై ముమ్మరంగా పరిశోధన జరుగుతుంది. రాగి, జొన్న, సజ్జ, కర్ర వంటి చిరుధాన్యాలు పంటల్లో తక్కువ కాలపరిమితి మరియు అధిక దిగుబడి నిచ్చే రకాలైన వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రూపొందించారు ముఖ్యంగా చిరుధాన్యాల ద్వారా అందరికీ మంచి పోషకాలు అందించడమే కాకుండా ఆరోగ్య సమస్యలు కూడా తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయి కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా గ్రామీణ మహిళలకు వృత్తి శిక్షణ విలువ ఆధారిత ఉత్పత్తులు బిస్కెట్లు సేమ్యా చాక్లెట్లు పాస్తా వంటివి తయారు మరియు ప్రదర్శనలు మార్కెట్లో సదుపాయాలు కల్పిస్తున్నారు వరి ధాన్యం పండించడానికి అధిక పెట్టుబడి ఎక్కువ నీరు ధాన్యం కొనుగోలులో అధిరోహించాలంటే తక్కువ కాలంలో ఎక్కువ పెట్టుబడిలో తక్కువ నీరుతో ఆరోగ్యకరమైన పంటను ఎక్కువ ఆదాయము పొందవచ్చు అని కండవు ప్రసాద్ రావు తెలిపారు మన రాష్ట్రం రైతాంగం చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు.

ఈనెల 21న సీపీఐ జిల్లా కమిటీ సమావేశం

విశాలాంధ్ర - పార్వతీపురం : ఈనెల 21న పార్వతీపురం మన్యంజిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా సమితి సభ్యులతో కలిపి సర్వసభ్య సమావేశం జరుగుతుందని జిల్లా కార్యదర్శి మన్మదరావు, సహాయ కార్యదర్శి జీవన్ల తెలిపారు. ఈ సమావేశంనకు ముఖ్య అతిథిలుగా కామ్రేడ్ గుజ్జల ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా ఇన్ ఛార్జీ భాధ్యులు కామ్రేడ్ పీ.కామేశ్వర రావు సీపీఐ రాష్ట్ర నాయుకులు పాల్గొంటారని చెప్పారు. సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

వైభవంగా అంకమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మండలం, ధర్మవరం శివారు బక్కునాయుడుపేట గ్రామ దేవత శ్రీఅంకమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. అంకమ్మ పేరంటాలను మహిళలు, భక్తులు దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించారు. ఈ తీర్థ మహోత్సవానికి వివిధ గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

నేడే మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు వర్ధంతి జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బొబ్బిలి : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమం రేపు 18న ఉదయం 10 గంటలకు పట్టణం దక్షిణ దేవుడు సెంటర్ జంక్షన్ వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మహానేత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు నివాళులు అర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజయ్ కృష్ణ రంగారావు హాజరుకానున్నారు.

పులి తిరిగిన ప్రదేశంలో గుర్తు తెలియని మృతదేహం

విశాలాంధ్ర - తెర్లాం : మండలం లో వెలగవలస గ్రామ రెవెన్యూ లో గల లేటు చేపేన. జగన్నాధం కొడుకు వెలగవలస సర్పంచ్ ఫాల్గుణ మామిడి తోటలో గుర్తు తెలియని వ్యక్తి యువకుడు బాడీ ఉందని ఆ తోట మాలి ఉత్తరావల్లి చిన్నంనాయుడు సర్పంచ్ ఫాల్గుణకు గుర్తు తెలియని బాడీ ఉందని సమాచారం అందజేశారు. సర్పంచ్ ఇదే విషయాన్ని సోమవారం సాయింత్రం తెర్లాం పోలీస్ వారికి సమాచారం అందజేశారు. తెర్లాం ఎస్ఐ వేరే డ్యూటీలో బయట ఉన్నందువలన రామభద్రపురం ఎస్ఐ సురేంద్ర నాయుడు కు భాధ్యతలు అందజేశారు. ఈ విష్యం తెలిసిన వెంటనే ఇంచార్జీ ఎస్ఐ సురేంద్ర నాయుడు హుటా హుటిన ఏఎస్ఐ మల్లేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ రాజు తన సిబ్బందిని వెంటపెట్టుకుని ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే చీకటి పడడం తో ఏమి చెయ్యలేని పరిస్తితి, ఎటు చూసిన కిలో మీటర్ దూరంలో గ్రామాలు, కారు చీకటి లో సవం దగ్గర బిక్కుబిక్కుమంటు ప్రాణాలకు తెగించి పండగతో బార్య బిడ్డలు ను విడిచి పెట్టీ శవం దగ్గరే డ్యూటీలు నిర్వహిస్తున్న పోలీస్ వారు. ఇందులో ఎస్.ఐ సురేంద్ర నాయుడు కూడా రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా బాడీ దగ్గర తన సిబ్బందితో ఈ స్థలం పరిసర ప్రాంతాలలో లైట్లు వేసుకుని గాలింపులు చేపట్టారు.ఎక్కడ ఎటువంటి ఆచూకీ కనబడ లేదు.రాత్రి గడిచి తెల్లవారక ఎస్.ఐ రమేష్ నాయుడు తన జీపు తో మరికొంత మంది సిబ్బంది, ఆ గ్రామ వి.ఆర్వో అర్.రామయ్య ను వెంటపెట్టుకుని ఘటన స్థలానికి చేరుకునీ పరాశర ప్రాంతాల్లో ఆధారాలు కోసం గాలుపులు చేపట్టారు. ఈ విషయాలు ఇలా ఉండగా ఇంతలో పోస్టుమార్టం నిమిత్తం బాడంగి పి.హెచ్ డాక్టర్ విశ్వనాథం తన సిబ్బంది తో వచ్చి బాడీని పరిశీలించి సవ పంచనామా నిర్వహించారు.అనంతరం శవానికి దగ్గర లో ప్రభుత్వ స్థలంలో జే.సి.పి సాయంతో గుమ్ము తీసి అంత్యక్రియలు నిర్వహించామని పోలీస్ వారు అన్నారు. ఈ దుర్ఘటన ఎలా జరిగింది, తను ఎవరు, ఎక్కడ నుంచి వచ్చారు. ఇక్కడ గత మూడు రోజులు క్రితం ఈ శవం పడివుండవచ్చని, దట్టమైన మామిడి తోటలు ఉండడం వలన ఎవ్వరికీ కాన రాలేదని బాడీకి పురుగులు పట్టేసి చేతి వేలు,కాలు వేలు ఎవి లేవని అందువలన బాడీ బాగా పాడు అయిపోయిందని డాక్టర్ అన్నారు. ఇంత వరకు తన కోసం ఎటువంటి సమాచారం రాలేదని ఈ దుర్ఘటన పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు మధ్య తను వయస్సు ఉంటుంది అని, తనకు తానే ఇక్కడ కు వచ్చి ఏమయినా చేసుకున్నాడా, గుర్తు తెలయని వ్యక్తులు ఎక్కడో చంపి ఇక్కడ బాడీ నీ పడేసారా, లేదా ఇక్కడే తనని ఏమయినా చేశారా అని సమగ్ర దర్యాప్తు చేసి వివరాలు తరువాత వెల్లడిస్తామని తెర్లాం ఇంచార్జి ఎస్.ఐ సురేంద్ర నాయుడు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నా రమేష్ నాయుడు విశాలాంధ్ర విలేకరుతో మంగళవారం ఘటన స్థలంలో తెలిపారు.

ఏట రైతుకు నష్టాలే : కండపు ప్రసాదరావు

విశాలాంధ్ర - పాలకొండ : రాష్ట్రమంతా సస్యశ్యామలంగా ఉందని మూడేళ్లలో ఒక్కొక్క కరువు మండలం ప్రకటించలేదని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెబుతున్న పంట దిగుబడులు లెక్కలు మాత్రం ఆయన మాటల్లో డొల్లతనాన్ని ఎత్తిచూపుతున్నాయని అభ్యుదయ రైతు కండవు ప్రసాదరావు తెలిపారు. విలేకరులతో ఏ పంటల దిగబడులను గణాంకాల శాఖ తెలియపరుస్తుందని ఆ ప్రకారమే దిగుబడులు వివరాలు వెల్లడిస్తారన్నారు. 2019-20 పంటల ఉత్పత్తి ముగింపు అంచనాలన్నీ వెల్లడించిన ఘనంక శాఖ రైతులందరూ ఆనందంతో ఉన్నారని చెప్పుతున్న ముఖ్యమంత్రి గత రెండేళ్లలో భారీగాక్షిని క్షమించాయి. ఆహార ధాన్యాల గణాంకాలు పంటల ఉత్పత్తి ఏకంగా 2.4 లక్షల టన్నులు తగ్గాయని గణాంకాలు తెలిపాయ అన్నారు. భారీ వర్షాలు వరదలతో వరి రైతులు కోలుకోలేని దెబ్బ తగిలింది. 2021-22 లో 17.24 క్వింటాళ్లు 2019-20 ఖరీఫ్ లో 16.89 క్వింటాళ్లు మాత్రమే లభించాయి. 2019-20తో పోలిస్తే 2021-22 సంవత్సరంలో వరి సాగు పెరిగిన ఉత్పత్తి 15.34 లక్షల టన్నుల మీద తగ్గిపోయింది ప్రధాన పంట కాలమైన ఖరీఫ్లో ఎకరాకు సంఘటన నాలుగు క్వింటాలు తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే సుమారు 2900 కోట్ల విలువగల పంట దిగుబడి తగ్గింది. వేరుశనగ సాగుకు ఎకరాకు 40 వేలకు పైగా పెట్టుబడి పెడితే 2021-22 ఖరీఫ్ లో 1.75 క్వింటాల్లో దిగుబడి వచ్చింది. మద్దతు ధర ప్రకారం అమ్మిన వచ్చేది 9712 రూపాయలు మాత్రమే. గత రెండేళ్లుగా అన్నదాతకు లో కేంద్ర బృందం కూడా వెళ్లి పరిశీలించి నష్టపరిహారం సాయం మాత్రం చేయలేదు. కొన్నేళ్ల వర్షాభావం. తరువాత అధిక వర్షాలతో పెట్టుబడును కోల్పోయారు. దిగబడులు లేక నే రైతులు ఇతర పంటలకు మొలుతున్నారు. గత ఖరీఫ్లో ధాన్యానికి మద్దతు ధర స్వల్పంగా పెంచిన ధాన్యం కొనుగోలు విధానంలో జంబ్లింగ్ విధానం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో 80 కిలోల బస్తాకి 100 రూపాయల పైన రవాణా చార్జీలు వసూలు చేస్తున్నారు. ధాన్యానికి రవాణా ఏర్పాటు చేస్తామన్న పౌరసరఫరా శాఖ చేతులెత్తేయడంతో ప్రైవేట్ వాహనదారులు దందాతో రైతులను నష్టపోతున్నారు. గత రెండు సంవత్సరాల నుండి ధాన్యం రవాణా చార్జీలు రైతులు ఖాతాలో చేస్తామన్న పాలకులు మొండి చేయి చూపారు. ఇప్పటికైనా స్పందించి గత రెండు సంవత్సరాల నేటికీ కలిపి రవాణా చార్జీలు చెల్లించి వారి మాటలను నిలబెట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

చాగంటి తులసి కూనలమ్మ పదాలు పుస్తకావిష్కరణ

విజయనగరంలో ఘనంగా చాసో జయంతి

విశాలాంధ్ర - విజయనగరం : ప్రముఖ కథా రచయిత్రి చాగంటి తులసి రాసిన కూనలమ్మ పదాలు పుస్తకావిష్కరణ మంగళవారం జరిగింది. చాసో (చాగంటి సోమయాజులు) జయంతి సందర్భంగా విజయనగరం లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పుస్తకావిష్కరణ జరిగింది. అరసం ఆధ్వర్యంలో రెండు భాగాలుగా సమావేశం జనిగింది. ప్రముఖ వాయులీన విద్వాంసులు ద్వారం దుర్గా ప్రసాదరావు, సాహితీ వేత్తలు పి.లలిత, జయసూర్య, సుమస్పతి, చిత్రకారుడు అన్వర్ కూనలమ్మ పదాలు ఆవిష్కరించారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో ద్వారం దుర్గా ప్రసాదరావు మాట్లాడుతూ 1922లో చాసో రాసిన తెలుగు, ఇంగ్లీష్ సాహిత్యం నేటికీ నిత్య నుతనంగా వున్నాయన్నారు.చాసో సుదీర్ఘ ప్రయాణం లో అనేక అంశాలు పరిశీలించే వారన్నారు. అందుకే ఆయన కథలు సజీవమైన పాత్రలతో నిండివుంటాయన్నారు. కూనలమ్మ పదాలు రచయిత్రి తులసి చాసో వారసత్వాన్ని కొనసాగిస్తున్నారన్నారు.ఒక రచన రావడానికి ఎంతో స్పర్థ అవపరమవుతుందన్నారు. కూనలమ్మ పదాలు లో ఆమె స్ఫుటంగా తన భావాలు తెలిపారన్నారు. ప్రతి పద్యం దేనికదే ఒక ప్రత్యేకత, భావం కలిగివుండడంతో పాటు అభ్యుదయ భావాలున్నాయని చెప్పారు.దీర్ఘ కవితలు వుంటే కొత్త అనుభవాలను పొందవచ్చున్నారు. చాలామంది జానపదం అంటే గ్రామీణ జీవితానికి సంబంధించినదిగా భావిస్తారుగానీ, ప్రతి ఒక్కరి జీవితం జనపదమేనన్నారు. ఈ సందర్భంగా త్యాగరాజ స్వామి కీర్తనల్లో సాహిత్యం, వాటిలో లయ విశేషాలను పాడి వినిపిస్తూ దుర్గాప్రసాదరావు సోదహరణ ప్రసంగం చేశారు.అలాగే శ్రీరంగం నారాయణబాబు, అంట్యాకుల పైడిరాజు, ఆయలసోమయాజుల నరసింహం (అ.న మాష్టారు) తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నారాయణ బాబు తనను ద్వారం యెహుది మెన్యున్ అనేవారని తెలిపారు. చాసో వారసత్వాన్ని, ఉత్సాహాన్ని కొనసాగిస్తూ తులసి సాహిత్యాన్ని కొనసాగిస్తున్నారని కొనియాడారు. చిత్రకారుడు అన్వర్ మాట్లాడుతూ విజయనగరం తన తల్లిగారు ఊరని తెలిపారు. శ్రీపాద వారి అనుభవాలు జ్ఞాపకాలు తరువాత రచయిత్రి చాగంటి తులసిలోని ఉత్సాహం తనకెంతో స్ఫూర్తి కలిగించిందన్నారు. కూనలమ్మ పదాలు పుస్తకం ఆద్యంతం ఆసక్తిగా ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో రచయిత్రి చాగంటి తులసి మాట్లాడుతూ రోణంకి, శ్రీశ్రీ తదితర సాహితీవేత్తలతో ఉన్న సాహిత్యానుభవాలను వివరించారు. కూలమ్మ పదాలు పుస్తకలంలో తనకు తన సాహితీ మిత్రుల గురించి ప్రస్తావించానన్నారు. సమాజంలోని అనేక వర్తమాన సంఘటనల పరిశీలనతో రాసిన కవితలు పుస్తకంలో ఉన్నాయని చెప్పారు. పి లలిత, జయసూర్య, సుమనస్పతి కూనలమ్మ పదాలు పుస్తకం లోని సాహిత్య విశేషాలు వివరించారు. కూనలమ్మ పదాలతో లపాటు మరికొన్ని వచన కవితలు పుస్తకంలో ఉన్నాయని అవి సాహిత్య వరంగా మరింత ఉన్నత స్థాయిలో ఉన్నాయన్నారు. ప్రతి కవితలోని అంతర్లీనంగా ఉన్న భావాన్ని తెలుసుకున్నప్పుడే రచయిత ఏ కోణంలో కవిత రాసారనేది అవగతమవుతుందని సుమనస్పతి, జయసూర్య, లలిత అన్నారు. ఈ సందర్భంగా , అరసం ప్రతినిధి జి ఎస్ చలం, సాహితీ స్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్ తదితరులు మాట్లాడారు.

బత్తుల సేవలు అభినందనీయం

గ్రామంలో 15 మంది మహాపురుషుల విగ్రహాలను ఏర్పాటు

విశాలాంధ్ర - సీతానగరం : ఆయనో సాదారణ వ్యక్తి. ఆయనకు దేశంపై అభిమానం, జాతీయ నాయకులంటే భక్తి,టీడీపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు అంటే వీరాభిమానం, గ్రామాల్లో ఏదో చేయాలన్న తపన తదితరఅంశాలు ఆయన జీవితంతో ముడిపడి అయనను ప్రభావితం చేశాయని తెలుస్తోంది. సాధారణంగా పల్లెల్లో గ్రామ పంచాయతీ తరపున ఏదో ఒక విగ్రహం ఏర్పాటు చేయడం మనకు కనిపిస్తూ ఉంటుంది. ఎక్కువ గ్రామాల్లో జాతిపిత గాంధీజీ విగ్రహం, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయడం మనం చూస్తుంటాం. కానీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన నేతలను గ్రామస్తులు నిత్యం స్మరించుకోవాలని, వారిని ఆదర్శంగా తీసుకోవాలనే తలంపుతో సీతానగరం మండలం లచ్చయ్యపేట గ్రామానికి చెందిన సాదారణ వ్యక్తి గ్రామం నలుమూలలా 15మంది జాతీయ నాయకుల విగ్రహాలు నెలకొల్పి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. దీనివల్ల సమైక్యత భావం అందరిలోనూ నిలిపేలా చేశారు. ఆయనే మండలంలోని లచ్చయ్య పేట గ్రామానికి చెందిన బత్తుల శ్రీరాములునాయుడు. గ్రామ ప్రధాన కూడళ్లలో విగ్రహాల ఏర్పాటుకు ముందుకొచ్చారు.15 విగ్రహాలను గ్రామంలో అన్ని వీదుల్లో ఏర్పాటు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. స్థానిక ప్రాధమిక పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి, గాంధీజీ విగ్రహాలు, పాత ఊరిలో అల్లూరి సీతారామరాజు, మరో కూడలిలో గాంధీజీ నిలువెత్తు విగ్రహం, ప్రధాన కూడలి వద్ద మదర్ థెరిసా, అంబేద్కర్, కాలనీలో బాబూ జగజ్జీవన్ రాం, సుభాష్ చంద్రబోస్, బిసి కాలనీలో ఎన్.టీ.ఆర్ విగ్రహాన్ని, కుమరం భీమ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. దీనివల్ల జాతీయ నాయకుల జయంతి, వర్ధంతి సందర్భాల్లో గ్రామంలోనే నివాళులర్పించే అవకాశం స్థానికులకు దొరికింది. గ్రామాభివృద్ధిలో భాగస్వామికావాలనే ఆలోచనతోనే విగ్రహాల ఏర్పాటు చేసినట్లు దాత శ్రీరాములు నాయుడు తెలిపారు. గ్రామంలో మొదట ప్రగతిశీల యువజన సంఘం స్థాపించి అధ్యక్షుడుగా ఉండి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు అంటే తనకు ఎంతో ఇష్టమని చెబుతూ ఆయన నిలువెత్తు విగ్రహాన్ని తాను నివసించే కాలనీలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాను కష్టపడుతూ సంపాదించిన దానిలో కొంత పేదలకు సహాయం చేయాలన్న ఆలోచన వల్ల ఇటువంటి పనులు చేస్తున్నట్లు చెప్పారు. తనకు విశాఖ సమాచారంతో పాటు పలు సేవా సంస్థలు చేసిన సత్కారాలు, సన్మానాలు మరువలేనివని తెలిపారు. ఎల్లప్పుడూ తాను సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

హై రిస్క్ గర్భిణీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి

విశాలాంధ్ర - బెలగాం : హై రిస్క్ గర్భిణీలను, నవజాత శిశువులను ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది గృహ సందర్శనలు చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. సీతానగరం మండలం చిన అంకలాం గ్రామాన్ని సందర్శించి గర్భిణీలు, చిన్నపిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, టీకా నిర్వహణకు సంబందించిన మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారంను వినియోగించు కోవాలని, వైద్య సిబ్బంది ఇస్తున్న ఐరన్ మాత్రలు వేసుకోవడం తద్వారా రక్తహీనతకు, ప్రసవ సమయంలో ఎటువంటి సమస్యలకు గురికాకుండా ఉండొచ్చని సూచించారు. అదేవిధంగా చిన్న పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేసి తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని ఏ చిన్న అనారోగ్య సూచనలు వున్నా వెంటనే వైద్యసిబ్బంది దృష్టికి తీసుకు రావాలని, వైద్య సిబ్బంది సూచించిన తేదీల ప్రకారం పిల్లలకు టీకాలను వేయించాలని సూచించారు.

జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు -2022

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : ఎనిమిదేళ్లుగా రావి రంగారావు సాహిత్య పీఠం నిర్వహిస్తున్న "జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు (2022) ఫలితాలు ప్రకటించిందని ఈ ప్రాంత ప్రముఖ కవి రచయిత చింత అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆరు పుస్తకాలకు పురస్కారాలు అందజేస్తున్నారు. 1. అరిసేతిలో బువ్వ పువ్వు (వచన కవితలు) చింతా అప్పలనాయుడు (పార్వతీపురం, మన్యం జిల్లా), 2. ఎగురుతున్న పద్యం (వచన కవితలు) అవ్వారు శ్రీధర్ బాబు (నెల్లూరు), 3. కల్లంచుల బువ్వ (దీర్ఘ వచన కవిత) ఈ. రాఘవేంద్ర (రాయదుర్గం, అనంతపురం జిల్లా), 4. సమీకరణం (వచన కవితలు) డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు (గుంటూరు), 5. మువ్వ (పద్య కవితలు) బులుసు వెంకటేశ్వర్లు (చిట్టి వలస, విశాఖ జిల్లా),6. చినుకు తాకిన నేల (వచన కవితలు) శాంతి కృష్ణ (హైదరాబాద్) వీటిని ఎంపిక చేశారన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదిక మీద ఫెబ్రవరి 9 గురువారం సాయంత్రం 6 గంటలకు జరిగే సభలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పూర్వ ప్రాచార్యులు గుజ్జర్లమూడి కృపాచారి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి పూర్వ సభ్యులు గుత్తికొండ సుబ్బారావు, ప్రముఖ సాహితీ విమర్శకులు డా. గుమ్మా సాంబశివరావు మొదలైన అతిథుల సమక్షంలో ఒక్కో పుస్తక కవికి రెండు వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కారం ఉంటుందని నర్రా ప్రభావతి, కన్వీనరు, రావి రంగారావు సాహిత్య పీఠం, గుంటూరు ఉంటుందని తెలిపారు అన్నారు.

ప్రయాణికులతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట

విశాలాంధ్ర - రామభద్రపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ పట్టణాల నుంచి వచ్చిన పల్లెప్రజలు నాలుగు రోజులు పండగ సరదాగా గడుపుకొని బుధవారం తిరుగు ప్రయాణంలో నిమగ్నమయ్యారు. మండల కేంద్రంలో ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద ప్రయాణికులతో కాంప్లెక్స్ సందడిగా నెలకొంది. దూర ప్రాంతాలు నుండి వచ్చిన వారంతాసొంత గ్రామాలకు వచ్చి కుటుంబ సభ్యులతో పిల్లాపాపలతో సరదాగా గడిపారు. అనంతరం ఎవరు పనిలో వారు చేరేందుకు తిరుగు ప్రయాణం అయ్యారు. బస్సులన్నీ ప్రయాణికులతో కిటకి టలాడుతున్నాయి. ఏ బస్సు చూసిన ప్రయాణికులతో కిటకిటలాడుతుంది. అలాగే పండగ సందర్భంగా కొన్ని గ్రామాలలో కోడిపందాలు జూదం జోరుగా సాగాయి. ఈ పందాలలో లక్షల రూపాయలు చేతులు మారాయి. పల్లె వాసులంతా సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

నేడు స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

మండల పార్టీ అధ్యక్షుడు గోంప.

విశాలాంధ్ర - వేపాడ : మండల కేంద్రమైన వేపాడలో బుధవారం తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక స్వర్గీయ డాక్టర్ పద్మశ్రీ నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకట్రావు తెలిపారు. బుధవారం ఉదయం 9:00 గంటలకు శృంగవరపు కోట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువనేత గొంప కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే బోయే ఈ వర్ధంతి వేడుకలు వేపాడ వల్లంపూడి కూడలిలో ఉన్న అన్నగారి విగ్రహం వద్ద ఘన నివాళి అర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఐటీడీపీ, టి.ఎన్.ఎస్.ఎఫ్, టి.ఎన్.టి.యు, తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు రైతు, ఎన్.టి.ఆర్ అభిమానులు పార్టీ కుటుంబ సభ్యులు, ప్రజలు, మహిళలు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

సీతానగరం : మండల కేంద్రం లోని కొమ్మినేని కిషోర్ కుమార్ స్వగృహం నందు బుదవారంనాడు టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణు గోపాలనాయుడులు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు పాల్గొంటారని తెలిపారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం గ్రామ శివారు బక్కు నాయుడు పేట గ్రామ దేవత అంకమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో విజయనగరం, అనకాపల్లి జిల్లాల నుండి 12 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. పోటీలు తిలకించేందుకు మండల పరిధి గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యారు.

జరజాపుపేటలో నాయకుల శ్రమదానం

విశాలాంధ్ర - నెల్లిమర్ల : నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలో సంక్రాంతి సెలవులు సందర్భంగా పారిశుధ్య కార్మికులు హాజరు కాకపోవడంతో నాయకులు శ్రమదానంతో పారిశుధ్య పనులు చేపట్టారు. జరజాపుపేట ప్రధాన రహదారిపై డ్రెయినేజీ చెత్తతో నిండిపోవడంతో రహదారిపై మురిగినీరు ప్రవహిస్తోంది. దీంతో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, నాయకులు నల్లి శ్రీనివాసరావు, తుమ్ము నారాయణ మూర్తి, ఉపాధ్యాయులు తాళాడ మహేష్ శ్రమదానంతో పారిశుధ్య పనులు చేసి సమస్యను పరిష్కరించారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

విశాలాంధ్ర - నెల్లిమర్ల : నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి రామతీర్థం జంక్షన్ లో మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టిడిపి నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9-30 గంటలకు వర్ధంతి కార్యక్రమం నిర్వహించ నున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మండలంలో నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మోటార్ సైకిళ్ళు ఢీ కొని ఒకరు మృతి

విశాలాంధ్ర - కొమరాడ/బెలగాం : కొద్ది రోజులలో వివాహం జరగవలసిన యువకుడు మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలోను గ్రామంలోను విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే కొమరాడ మండల పోలీసు స్టేషన్ ఎస్ఐ జగదీష్ నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమరాడ మండలం గంగరేగువలస గ్రామానికి చెందిన రావాడ చంద్రశేఖర్ (29) మోటార్ సైకిల్పై తన ఇంటి నుండి ప్రధాన రహదారిపైకి వస్తుండగా పార్వతీపురం నుండి కొమరాడ అత్తవారింటికి మోటార్ సైకిల్ పై గొర్లి భాను ప్రకాష్ భార్య,పిల్లలతో వస్తుండగా ఇద్దరూ ఢీకొన్నారు. ఈసంఘటనలో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కొమరాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అందచేశారు. బానుప్రకాశ్, అతని భార్య పిల్లలు స్వల్పంగా గాయపడ్డారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందారు. కొమరాడ పోలీసు స్టేషన్ ఎస్ఐ జగదీష్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి ఫిబ్రవరి 9వ తేదీన వివాహం జరగవలసి ఉంది. దీనితో ఆ కుటుంబం, గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.